# పరమపదసోపానం

(ఆంధ్రపత్రిక 26-7-78)

ఎదగాలనుకోవడంలో తప్పులేదు.

కానీ ఆర్థికంగా ఎదగడానికి మనసును, మనశ్శాంతిని ఖర్చు పెట్టుకోకూడదు.

—జయప్రద

---

"మోనా...."

"ఏయ్ మోనా...."

"ఏయ్ కోతి! నా పేరు మోహనుడు. ఇంకెప్పుడైనా మోనా అన్నావంటే తంతాను"

స్నేహితుడు ఉడుక్కుంటుంటే జడ ముందుకు వేసుకుంటూ గలగల నవ్వుతూంది పది సంవత్సరాల చిలిపి పిల్ల మాధవి.

"నేను కోతినైతే నువ్వెవరు మోనా"

పరుగు తీయబోయింది.

ఆ పిల్ల జడ మోహనుడి చేతిలో చిక్కుకుని వెనక్కుపడింది.

"లే, లే! మట్టంతా అంటుకుంది. ఇక నీ జట్టు రానుపో! కాకర కాయ, బెండకాయ టూ...." కోపంగా చూపించింది.

"నా జట్టురావూ? అయితే నీకు రోజా పంకాకులెవరు తెచ్చిస్తారేం?"

"నువ్వు తెచ్చివ్వకపోతే నాకు దొరకవా? వేణు తెచ్చిస్తాడులే!" బుంగమూతి పెట్టుకొని కోపంగా చూసింది మాధవి.

"అయితే వేణుగాడిచేతే తెప్పించుకో. వాడూ, నువ్వూ జట్టు. నేను రానేరాను" మూతి ముడుచుకొని విసురుగా పోతున్న స్నేహితుడి చేతిని గట్టిగా పట్టుకొని....

"అయితే సాయంత్రం బువ్వాటకు రావా....?" అంది కాస్త బెంగగా.

వాడు లేకపోతే ఆ పిల్లకు క్షణం తోచదు.

"నువ్వు వొద్దన్నావుగా?" ఆ పసిపిల్లమీద అపవాదు వేసి తనది తప్పులేనట్లు ధీమాగా నిలుచున్నాడు పదకొండు సంవత్సరాల మోహనుడు.

"పోనీలే మోనా....అహ....మోహనా తమాషాకన్నాను కదా! నువ్వు లేకపోతే నాకు బాగుండదు. అయినా బియ్యం బెల్లం తేవాల్సినవంతు నీదిగదా ఈరోజు. అది లేకపోతే మేమెలా చేసుకోం?" దీనంగా చూసింది.

మోహనుడికి ఆ పిల్ల కళ్ళల్లోకి చూసేసరికి కోపమంతా తుడిచి పెట్టుకు పోయింది.

"వస్తాలే మాధవీ.... నేను లేకపోతే మీకు వేయడం చేతకాదుగా పాపం?"

మాధవి జడకొసను రిబ్బన్ సరిచేస్తూ జాలిపడ్డాడు.

వాడి మాటలకు ఆ పిల్ల కళ్ళు మిలమిలా మెరిసాయి.

"మరి సాయంత్రం మర్చిపోకుండా రావాలి ఏం....?" అంటూ కుచ్చెళ్ళు పైకెత్తి గంతులేస్తూ, పరుగుతీస్తూ దూరంగా పోయి అక్కడ నుండి వెనక్కి తిరిగి....

"మోహనా! తప్పక రావాలి. రాకపోతే రేపు బళ్ళో నేను నీతో మాట్లాడను తెలిసిందా?" పెద్దగా అరిచింది-ఆ అబ్బాయిమీద తన అధికారాన్ని సూచిస్తూ.

'అలాగే కోతిపిల్లా' మనసులోనే అనుకొని దగ్గరగా వున్న చిన్న రాయి తీసుకొని దూరంగా వున్న చెరువు నీటిలోకి విసురుగా విసిరి పరుగు-పరుగున చెరువు గట్టుకుపోయి చెరువులో రేగే అలలను చూస్తూ ఈలవేసుకుంటూ ఇంటివేపు పరుగుతీసాడు ఆ కొంటె పిల్లవాడు.

* * * *

"పెన్ను తీసుకురాలేదా అమ్మాయ్! అయితే బయటికి పో" పెన్ తీసుకొని రాలేదని కోప్పడ్డాడు మాస్టారు.

అభిమానం దెబ్బతిన్న మాధవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మోహనుడు చటుక్కున లేచి—

"పొద్దున మాధవి పెన్ను నేను తీసుకున్నానండి మాస్టారూ!" అంటూ తన పెన్ తీసి మాధవి కందించాడు.

మాధవి తెల్లబోయి మోహనుడివైపు చూచి....

'కాదండి' అన్నట్టు తల అడ్డంగా తిప్పబోయింది.

అక్కడ్నుండి చెప్పవద్దన్నట్టు సైగచేసాడు మోహనుడు.

మాస్టారు మోహనుని బయటికి పంపిస్తుంటే అయోమయంగా—బాధగా చూసింది ఆ పిల్ల.

ఆరోజు ఆడుకోడానికి మర్రిచెట్టు క్రిందకు వచ్చినప్పుడు, సైగగా ఎవరికీ తెలియకుండా అంది మాధవి.

"ఎందుకు మోహనా అబద్ధం చెప్పావ్" అని—

"మరి నిన్ను మాస్టారు బయటికి పొమ్మన్నారుగా"

"పొమ్మంటే పోతానుగా! అబద్ధం చెప్పి నా బయలు నీవెందుకు వెళ్ళావ్?"

"నువ్వు ఏడ్చావూ?" అమాయకంగా అన్నాడు.

"మరి నిన్ను బయటికి పొమ్మంటే నువ్వూ ఏడవలా?" జాలిగా చూసింది స్నేహితుడివైపు.

"నేనేం ఏడవలా. నేనేం ఆడపిల్లనా ఏడవడానికి. ఎంచక్కా వెళ్ళిపోయి చెడుగుడు ఆడుకున్నాం నేనూ వేణూను" అన్నాడు గర్వంగా మోహనుడు.

సంతృప్తిగా, అమాయకంగా నవ్వుకుంది మాధవి.

ఎర్రగా, బొద్దుగా, ముద్దుగా వుండే మాధవి అంటే మోహనుడికి తగని అభిమానం.

బొమ్మలు, పుస్తకాలు, పిప్పరమెంట్ బిళ్ళలు రకరకాల సిరాలు ఎర్రసిరా, పచ్చసిరా, ఇంకా....ఇంకా ఎన్నో, ఎన్నో గవ్వలు, నెమలి ఈకలు, తెచ్చిచ్చేవాడు మోహనుడు.

తననొక్క క్షణమైనా వదలకుండా తనచుట్టూ మాధవీ! మాధవీ! అంటూ వెంటతిరిగే మోహనుడు అంటే మాధవికి ఎక్కడలేని ఇష్టం.

ఆ పిల్లతో చిలిపి కజ్జాలేసుకొని ఏడిపించందే ఆమె బుంగమూతి పెట్టి కోప్పడితే చూడందే ఒక్క క్షణమైనా వాడికి గడిచేది కాదు.

ఒకమారు కాల్చిన చింతగింజలన్నీ తనే తిని తనకు ఒక్కటి కూడా పెట్టకుండా ఏడ్పించాడని రెండురోజులు మాటలు మానేసింది మాధవి.

ఇద్దరికీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవాలని, చింతచెరువు దగ్గర పిట్టగూడులు కట్టుకోవాలని, మర్రిచెట్టుమీద కలసికట్టుగా కోతికొమ్మచ్చ లాటి ఆడాలని వుండేది. కాని....

"తను నాకు పెట్టకుండా ఎందుకు తినాలి? పైగా వూరిస్తూ" అని కోపం మాధవికి.

"తనే వస్తుంది. నేను లేకపోతే తనకి ఒక్క క్షణమైనా గడవదు" అని ధీమా ఆ చిన్ని మోహనుడికి.

కానీ ఇక వుండలేక తనే ఒకరోజు ఇన్ని చింతగింజలు తీసుకు వెళ్ళి ఇస్తే ఫక్కున నవ్వేసి జట్టు కలిపేసింది మాధవి.

* * * *

నెలవులంతా ఇట్టే గడిచిపోయాయి.

ఆ దినం పరీక్షా ఫలితాలు వచ్చాయి.

మాధవీ ఫస్టుఫారమ్ పాసయ్యింది.

మోహనుడిది పోయింది.

"మాధవీ! నా పరీక్ష పోయింది. నువ్వు పాసయ్యావటగా తెలుసా" గంతులేసుకుంటూ వచ్చి పరీక్ష పోవడమంటే ఏమిటో తెలియని మోహనుడు చెపుతుంటే చూచీ చూడనట్టు పోబోయింది మాధవి.

"కోతీ! నిన్నే. నాతో మాట్లాడవా?"

"ఊహూ" ముఖం ప్రక్కకు తిప్పుకుంటూ అంది.

"ఏం?" కనుబొమలు ఎగరేస్తూ అడిగాడు తమాషాగా మోహనుడు.

"నీ పరీక్ష పోయిందటగా?"

పరీక్ష పోతే ఎందుకు మాట్లాడకూడదో అర్థంకాలేదు వాడికి.

"పరీక్ష పోతే మాట్లాడకూడదా?" అమాయకంగా అడిగాడు.

"ఏమో నాకు తెలియదు. అమ్మ చెప్పింది అలా అని" నిర్లక్ష్యంగా అంది మాధవి.

వాడికి మనస్సు చివుక్కుమంది. కాసేపు మౌనంగా వుండి అన్నాడు.

"పోనీ బాగా చదువుకొంటాను. నా జట్టుంటావా మాధవీ"

"ఉహు బాగా చదువుకున్నా నీజట్టుండను. నీకు డబ్బులేదటగా డబ్బులేని వాళ్ళతో, బీదవాళ్ళతో జట్టుండకూడదని అమ్మచెప్పింది." అమాయికంగా ఆ పిల్ల చెప్పుకుపోతుంటే ఆశ్చర్యంగా వింటున్నాడు మోహనుడు. డబ్బుంటేనే జట్టుండాలా? చదువుంటేనే మాట్లాడాలా? అంతా అయోమయంగా వుంది వాడి చిన్న మనసుకు.

'కానీ ఏదేమైనా ఇక మాధవితో తనకు స్నేహం. లేదు. ఆ చిలిపి పిల్ల తనతో ఇక జట్టుకురాదు. అనుకున్నప్పుడు ఆ పసివాని కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

ఇక అక్కడ ఉండకుండా పక్కనే ఉన్న చెరువుగట్టుమీద కూర్చొని చిన్న చిన్న రాళ్ళు వీరి చెరువులో వేస్తూ ఆ రాళ్ళు చెరువులో రేపే చిన్న చిన్న అలల వేపు చూస్తూ కూర్చున్నాడు. వాడి మనస్సంతా వికలంగా వుంది. కన్నీరు పెల్లుబికి వస్తూంది. మాధవి చెప్పిన మాటలు వాడి మనస్సులో మొట్టమొదటిసారి అంతస్తుల కల్లోలాన్ని రేపింది. కన్నీరు వాడి లేత చెంపల మీదుగా జారుతుంటే నిశ్చలంగా నీటిలోకి చూస్తూ ఉన్నాడు.

తన చెలికాడు ఏడుస్తుంటే తనకి ఏడుపువచ్చింది. అమ్మ చెప్పిన విషయాలు గాని, తమ మోహనుడితో అన్న విషయాలు గాని, అన్నీ మరిచిపోయి పరిగెత్తుకుంటూ తన మోనా దగ్గరకు చేరుకుంది ఆ పిల్ల. వాడి ప్రక్కనే కూర్చొని వాడి కన్నీళ్ళు తుడుస్తూ.

"ఎందుకు మోనా ఏడుస్తున్నావ్" అంది స్నేహితురాలి వైపు కోపంగా చూస్తూ—

"నువ్వు మాట్లాడ నన్నావుగా" అన్నాడు కోపంతో ఆ పిల్ల చేతిని తోసేస్తూ మోహనుడు.

"పోనీ ఇప్పుడు మాట్లాడుతున్నాగా, ఏడవకు" బుజ్జగించింది మాధవి.

"మరి మీ అమ్మ మాట్లాడ వద్దన్నదన్నావ్." తన అనుమానం వెలిబుచ్చాడు మోహనుడు.

"అహా అమ్మ వద్దన్నా, ఎవరు వద్దన్నా సరే నేను నీతో మాట్లాడుతాను సైగ్గా. పదా. మరి నువ్వేడవ కూడదయితే."

మోహను మాట్లాడలేదు. ఇంకా వాడికి అనుమానం పోలేదు.

"నిజంగా మోనా" అంది పెద్ద పెద్ద కళ్ళను త్రిప్పుతూ మాధవి.

"అయితే నువ్వు నాతో ఆడుకోడానికి వస్తావా?"

'ఆ'

"బడికి కూడా?"

'ఆ'

"మీ యింట్లో బువ్వాట ఆడుకుంటే పిలుస్తావా?

"తప్పకుండా పిలుస్తా."

"అయితే యీరోజు మేము నేరేడు పళ్ళు కోయడానికి వెళ్తున్నాం. నువ్వొచ్చి రాలే పళ్ళన్నీ ఏరుతావా?"

'ఆ'. ఒకసారి నేరేడు పళ్ళు ఏరి ఒడిలో వేసుకొని బట్టలన్నీ ఖరాబు చేసుకొన్నందుకు తల్లిచేత దెబ్బలు తిన్న సంఘటన జ్ఞాపకము వచ్చి వద్దందామనుకొంది ఆ పిల్ల. కాని వాడి మనస్సుకు సంతోషం

కలిగిద్దామని. సరేనని ఒప్పేసుకుంది. అప్పటికిగాని మోహనుడికి అనుమానం తీరలేదు. చొక్కాతో కన్నీళ్ళు తుడుచుకొని-

"రా పోదాం" అన్నాడు. చేతులు కలుపుకొని తేలికపడిన మనస్సులతో హాయిగా ఎగురుతూ ఇద్దరు ఇళ్ళ కెళ్ళిపోయారు.

"మా నాన్నగార్కి బదిలీ అయిపోయింది. మేం వేరే వూరు వెళ్ళిపోతున్నాం మోనా!" అంది మాధవి ఒకనాడు మోహనుడి ప్రక్కనే కూర్చుంటూ.

"అయితే యిక యిక్కడికి రావా మాధవీ. నన్ను మరిచి పోతావా?"— అప్పటికే ఆ విషయం విని దిగులుగా వున్న మోహనుడు ఏడుస్తూ అన్నాడు.

"మరేం చేయను మోనా! మా అమ్మా వాళ్ళతో నేనూ పోవద్దూ? నే నొక్కదాన్నే ఎలా ఉండడం!" మోహనుడు ఏడుస్తూవుంటే తనూ ఏడుస్తూ అంది.

మోహనుడు బిగ్గరగా ఏడుస్తున్నాడు.

"నిన్ను కూడ తీసుకపోదామని అమ్మతో చెప్తాలే మోనా. ఏడవకు" తను ఏడుస్తూనే స్నేహితుడిని బుజ్జగిస్తూంది ఆ పిల్ల.

"ఆహ నేను రాను. మా బామ్మను వొదిలేసి ఎలా వచ్చేది?" కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

"ఏం"

"నేను నీతో వచ్చేస్తే మా బామ్మకు అన్నం ఎవరు పెడ్తారు?"

"వంటవాళ్ళు లేరా! నువ్వేలా పెడ్తావ్ అన్నం?" అమాయికంగా అడిగింది మాధవి.

"ఉహు. మాకు వంటవాళ్ళు లేరు. నేను చదువుకొని మా బామ్మకు బువ్వ పెట్టాలట! అందరూ చెప్తారు.

చదువుకొని బొమ్మకు బువ్వేలా పెట్టాలో ఆ యిద్దరిలో ఏ ఒక్కరికీ తెలియదు. కాని ఆరిందాల్లా మాట్లాడేసుకుంటున్నారు. "అయితే మాతో రావా! నే నొక్క దాన్నే వెళ్ళిపోయేదా!" దీనంగాచూస్తూ అంది. మోహనుడు ఏ జవాబు చెప్పలేదు. కొంచెంసేపు అలాగే మౌనంగా ఉండి.

"అయితే నువ్విక్కడే వుండు మాధవీ నేను నీ కొకటిస్తాను" అంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళి తమ ప్రాణప్రదంగా చూచుకుంటూ ఎవరన్నా అడుగుతారేమో అని బొమ్మ పెట్టిలో భద్రంగా దాచుకున్న కృష్ణుడు బొమ్మ, పోయిన సంవత్సరము తిరునాళ్ళలో బొమ్మ కొనిచ్చిన తనకు ఎంతో యిష్టమైన బొమ్మ తెచ్చి మాధవి కిచ్చి,

"ఇదిగో నీ దగ్గర జాగ్రత్తగా వుంచుకో. సరేగాని యీ వూరు మరలా వస్తే నన్ను కలిసికొనడము మాత్రం మరిచిపోకేం? అప్పుడు నీకు బోలెడు నేరేడు పళ్ళు కోసిస్తాను" ఏడుపులోనే నవ్వుతూ అన్నాడు.

'సరే' అంది మాధవి ఆ బొమ్మవైపు ఆశ్చర్యంగా చూస్తూ. ఒక్క సంవత్సరం పరిచయంతో అమాయికంగా అల్లుకుపోయిన ఆ పసి హృదయాలు రెండు దూరమైపోయాయి.

* * * *

'మాధవీ' భర్త కేకతో ఉలిక్కిపడి వ్రాస్తున్న కాగితాలను గాభరాగా డ్రాయర్లో దాచేసి భర్త చూడకుండా, తలుపు గొళ్ళెంతీసి తలుపు వారగా నిలుచుంది.

"ఏం? ఏం చేస్తున్నావ్ యింట్లో?" ఎప్పుడూ ఏదో కొంప మునిగి పోయినట్లు అట్లా ముఖం దిగాలు వేసికొని ఏడవకపోతే, కొంచెం హుషారుగా కనిపించకూడదూ?" అంటూ విసుక్కొంటున్న భర్త ముఖంవైపు అదోలా చూచి.

"ఏం చూచుకొని సంతోషం వెలిగించాలి" అనబోయి గొంతు లోనే మింగేసి, ఫ్లాస్కులోపోసి వున్న కాఫీతెచ్చి కప్పులోపోసి అతడు

బట్టలు మార్చుకొనే లోపల అతని ముందుంచింది. కాఫీ త్రాగి కృష్ణ బచ్చ వైపు దారి తీస్తున్న అతన్ని చూచి దుఃఖం పట్టలేక పడక గదిలోకి పోయి దిండులో తల దూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

మెలకువ వచ్చి చూసేసరికి ఏడు గంటలు కావస్తుంది. లేచి గదిలో దీపం వెలిగించి టేబిల్ ముందు కూర్చొంది. మనసంతా నిశ్చలంగా ఉంది. ఏ వికారమూ లేదు. దుఃఖమంతా కన్నీరు రూపంలో బయట పడిపోయింది. నెమ్మదిగా డ్రాయరు సొరుగు లాగి వ్రాసిన కాగితాన్ని బయటికి తీసి సక్రమముగా పెట్టి తను వ్రాసినంతవరకు ఆతృతగా చదువుకొని నిట్టూర్చి, కళ్ళు మూసుకొంది, మూసుకొన్న కళ్ళనుండి టపటప రాలాయి కన్నీటి బిందువులు వ్రాసిన కాగితాల మీద. ఆ నీటిని పైటకొంగుతో తుడిచి మరలా వ్రాయడానికి ఉపక్రమించింది.

"ఇది ఏనాటి కదో, ఎవరిదో కాదు. ఎవరిదో అయితే నేనీనాడు నిట్టూర్చే అవసరం లేకపోయేది. ఇది అచ్చు నా కథే నేనే మాధవిని. ఈ కథ యిలాగే సాఫీగా జరిగిపోయుంటే కన్నీళ్ళ కర్థము లేకపోయేది కానీ....కానీ....అబ్బ ఈ కథలో ఎన్ని మలుపులు! ఎన్ని దోవలు!!

ఆనాడు విడిపోయిన తరువాత అప్పుడప్పుడూ గుర్తు వచ్చేవాడు మోనా. కానీ కాలం గడిచేకొద్దీ నాలో మార్పు రాసాగింది. వయస్సుతో పాటు సంఘములో అంతస్థుల ప్రాబల్యం అర్థం కాసాగింది. డబ్బు, హోదా, చదువు మానవుల బంగారు కలలు. అనే సంఘములో కొలత బద్దలు.

ఆ కొలబద్దలతో సరి తూగేందుకు ప్రయత్నించ ఈ రోజులలో నేనూ వాటి ప్రాబల్యమునకు లొంగిపోక తప్పలేదు. నేనూ ఒక మనిషినే కానీ అవి నాలోని అహంకారానికి దోహదం చేసాయి.

అవే నా భావి జీవితంలో నన్ను నట్టేట్లో ముంచి వివశురాల్ని చేసాయి.

ఆనాటి ప్రభావానికి తట్టుకునే శక్తి నాలో లోపించింది. అందుకే నాకీ శిక్ష.... నాకీ శిక్ష.... అనుభవిస్తున్నాను.

నా అహంకారానికి ప్రతిఫలంగా నా జీవిత పధం మారిపోయింది. నాలో క్రొత్త వూహలు, క్రొత్త రూపాలు, క్రొత్త అభిరుచులూ, వీటన్నిటి క్రిందా, నా ప్రాణాతిప్రాణమయిన స్నేహితుడు, చెలికాడు, ప్రియాతిప్రియమైన, నా చిన్ననాటి మోనా మరుగున పడిపోతున్నాడు. అతని స్థానాన్నే ఖాళీ చేసానని భ్రమపడ్డ హృదయ ఫలకంపై వేరే రూపాన్ని చిత్రించేందుకు, చాలా అవస్థలు పడ్డాను.

ప్రతి వూహ వెనకాలా మోహనుడి నీడ కనిపించేది

ఆ నీడను తుడిచేసే ప్రయత్నంలో ఏమేమో వూహించుకున్నాను.

భవిష్యత్తుకు బంగారు నిచ్చెనలు వేసాను—నాకు డబ్బు వుంది. అతన్కు కనీసావసరాలు తీరనంత బీదవాడు. తను ఒకనాటికి డాక్టరు అవుతుంది.

ఫస్ట్‌ఫారం పరీక్ష తప్పిన మోనా ఏమీ కాలేదు. తనకు తెలిసిన వాళ్ళంతా పెద్దవారు డాక్టర్లు, లాయర్లు, జమీందారులు.... ఇంకా.... ఇంకా.... వీళ్ళందరిమధ్యా తన ప్రక్కన మోనా, మాసిన బట్టలతో, చింపిరి జుట్టుతో, ఏమీ రాని మోనా. అలా వూహించుకోవాలంటే నాకు భయమేసేది.

తన హృదయంలో మసక మసకగా వున్న మోహనుణ్ని పంపివేయడానికి నన్ను నేను మభ్య పెట్టుకోవడం మొదలెట్టాను.

"చిన్ననాటి స్నేహితుడు, జీవిత భాగస్వామి అవ్వాలని ఏముంది?" అని సంతృప్తి పడేదాన్ని.

కానీ రెండే రెండు సంఘటనలు నాకు వాటన్నిటి వెనకాలా వున్న కటిక నిజాన్ని చెప్పేవి.

ఒకటి అతనిచ్చే బొమ్మ పోగొట్టుకున్న రోజు, తన సర్వస్వం ఎవరో కాజేసినట్టు వెక్కి వెక్కి ఏడ్చిన సంఘటన, రెండవది తను యవ్వన ప్రాంగణంలో అడుగు పెట్టిన దినాల్లో అతనిని దూరాన చూచి, పరుగు పరుగున అతని దగ్గరకు చేరి అతను చేయి కలపగానే సిగ్గుతో పారిపోయిన దినం.

ఆరోజు ఆ సిగ్గుకు, ఆ అనుభూతికి కారణం స్పష్టంగా తెలియలేదు కానీ ఈనాడు దాని అంతర్యం పూర్తిగా బోధపడింది. కానీ ఆ విషయాన్ని దాచుకోవడానికి, నన్ను నేను మభ్య పెట్టుకోవడానికి సర్వ ప్రయత్నాలూ చేసాను.

అందులో విజయమే సంపాదించాను.

మొత్తానికి నా అహంకారం క్రింద అనురాగం నశించింది. నా అంతస్తు క్రింద నా మానవతే సిగ్గుపడి పారిపోయింది.

నా స్వప్నాలు, నా ఊహలు, నా భావాలు, బంగారు సోపానాల ప్రయాణాలూ, వీటన్నిటి క్రిందా, చిన్ననాటి చెలికాడూ, "వెళ్ళిపోతున్నావా మాధవీ" అని రోదించే మోనా "నాతో మాట్లాడవా? అని జాలిగా చూసే స్నేహితుడు జడపట్టి లాగి 'కోతీ' అని పిలిచే చిలిపివాడు.

"మరలా ఇక్కడికొస్తే నన్ను మిరచిపోకేం, నీకు బోలెడు నేరేడు పళ్ళు కొనిస్తాను" అని ఆహ్వానించే అనురాగ బంధువు నా మోనా మరుగున పడిపోతున్నాడు.

కళ్ళకు కన్పించనంత దూరం వెళ్ళిపోతున్నాడు.

బాల్యం వదలి యవ్వనంలో అడుగు పెట్టబోయే దశలో తల్లి దండ్రులు చుట్టాలు అంతా కలసి అంతస్థు పేరిట నన్ను మోసం చేసారు.

ఈనాడు "నీ దౌర్భాగ్యానికి నువ్వే చింతించు" అంటూ తప్పుకున్నారు.

* * * *

నా ఆశయాలకు తగినట్టే, నేను కోరుకున్నట్టే ఇంటర్ మీడి యట్‌లో ఫస్ట్‌క్లాస్ రావడం, మెడికల్ కాలేజీలో సీటు రావడం జరి గాయి.

నేను కావాలనుకుంటే, అటువంటి సీట్లు ఎన్నయినా డబ్బుపెట్టి కొనగలను.

కానీ నేనే స్వంతంగా, కష్టఫలితంగా సంపాదించుకున్నాను.

అదే నా గర్వం.

ఆ గర్వంతోనే ఒకనాడు తెలిసీ తెలియని వయసులో కూడా ఫస్ట్ ఫారం కొట్టుకున్న మోహనుడి కళ్ళలో నీళ్ళు తెప్పించాను.

ఆరోజు తన ఆశయాలు నెరవేరాయి కదా అనే సంతోషాతిశయ ములో భవిష్యత్‌కు బంగారు నిచ్చెనలు వేసుకుంటూ నా భవిష్యత్తును మోసుకుపోవడానికి వచ్చే ట్రెయిన్ కొరకు ఎదురుచూస్తూ కూర్చున్నాను. స్టేషన్‌లో.

నాన్నగారు బుక్‌స్టాల్ దగ్గరకెళ్ళారు.

నా కాలాన్ని చంపడానికి ఆయుధాన్ని కొనివ్వడానికి. ఆయనకు తెలియదు, నా ఊహలను రజితపత్రాలల్లో పొందుపరచడానికే కాలం చాలదని.

అంతదూరాన ప్లాట్‌ఫారం మీద మోహన్. మాసిన బట్టలు, తైల సంస్కారంలేని జుత్తు, నీరసంగా, దీనంగా, బాధగా అంతకు వెయ్యి రెట్లు ఆత్రుతతో పదేపదే స్టేషన్ గడియారంవేపు చూస్తూ చిరాగ్గా పచార్లు చేస్తున్నాడు.

నా హృదయం ఒక్కక్షణం స్పందించడం ఆగిపోయింది.

కాలం స్తంభించింది.

ఆ క్షణం ఎంత బలవత్తరమయినదో గాని, తన ఆశయాలు బంగారు కలలు, ఒక్కమారుగా తెరవెనక్కు తప్పుకున్నాయి.

చిన్ననాటి స్నేహితుణ్ని కలుసుకోబోతున్నాననే సంతోషం నన్ను ముంచెత్తింది.

అంతవరకు అనుభవంకాని అనుభూతి ఏదో నా నరనరాన్నీ ఆక్రమించింది.

చలించే కనుపాపలతో తలెత్తి చూసాను.

ఆ క్షణంలో అతనూ ఇటే చూసాడు.

అతని ముఖంలో బాధ, భయం అన్నీ ఆ నిముషంలో మచ్చుకయినా కన్పించకుండా మటుమాయమయ్యాయి.

మొదటిరోజు పథ్యం తిన్న దీర్ఘ రోగిలా, కష్టకాలంలో పెన్నిధి దొరికిన బీదవాడిలా, పోతుందనుకున్న పరీక్ష పాసైన విద్యార్థిలా అతని ముఖంలో వేయి జ్యోతుల కాంతి.

వడివడిగా అడుగులేసుకుంటూ తనవైపే వస్తున్నాడు మోహన్.

సిగ్గుతో నా తల వాలిపోయింది.

నా గుండె కొట్టుకునే శబ్దం నాకే వినిపిస్తోంది.

"మాధవీ!"

ఆ కంఠంలో ఎనలేని ఆత్రుత.

తన ముందున్న చెప్పులు లేని కాళ్ళు మరలా నన్ను నా మిథ్యా ప్రపంచంలోకి లాగేసాయి.

ఆ కాళ్ళనుబట్టి వూహించుకున్నాను అతని రూపాన్ని.

క్షణికమైన ఉద్రేకం కరిగిపోయింది.

నా బంగారు స్వప్నాలను మట్టిపాలు చేసుకోవాలనిపించలేదు.

"మాధవీ!"

మరలా అదే పిలుపు.

ఆ పిలుపులోని ఆకర్షణకు ఉలిక్కిపడ్డాను.

వివశత్వంతో సడలిపోతున్న హృదయాన్ని చిక్కబట్టుకుని స్థిరముగా కూర్చున్నాను.

"ఏం మాధవీ! మాట్లాడవు?" ఆ పిలుపును నిరసించే బలం నాలో లోపించింది.

మెల్లగా తలెత్తాను.

"మాధవీ! నేను ...నీ మోహన" అతని ముఖంలోని తేజస్సుకు తట్టుకోలేక తలవంచాను.

"బాగున్నావా మాధవీ! మరలా మన వూరికి రాలేదేం? ఇప్పుడేం చేస్తున్నావు? అసలు నిన్ను నా జన్మలో కలుసుకోలేనేమోనని బాధపడ్డాను.

ఆరోజు స్కూలు దగ్గర కలుసుకుని విడిపోయిన క్షణంనుండి నిన్ను వెతుకుతూనే వున్నాను.

ఆరోజు నిన్ను వివరాలు అడిగి కనుక్కోనందుకు నన్ను నేను నిందించుకోని క్షణం లేదంటే నమ్ము మాధవీ! పోనీలే.... పోనీలే. నిన్ను కలుసుకున్నాను అంతే చాలు"

అతను మహరాజుగారి అంబారీ ఎక్కినంత సంతోషపడుతూ చెపుతుంటే, నిర్వికారంగా వింటున్నాను.

అతను అది తన అదృష్టమని పొంగిపోతుంటే అది నా దురదృష్టంగా భావించి చలికిపోయాను నేను. అతనిలోని విశ్వాసం నాలో మొండితనాన్ని రేకెత్తించింది.

నేను కోరుకుంటున్న మరకతాలు పొదిగిన భవిష్యత్తును ఊహించుకుంటూ తలెత్తాను.

నా శూన్యదిక్కులు చూచి ఒక్కడుగు వెనక్కి వేసాడు.

"నువ్వు.... మీరు.... మీరు" అతని తడబాటులో ధైర్యాన్ని కూడగట్టుకుని అన్నాడు.

"క్షమించండి, నేను మీరనుకుంటున్న మాధవిని కాదు- నా పేరు శారద"

కొరడాతో కొట్టినట్లు త్రుళ్ళిపడ్డాడు నా మాటలు విని.

అతని ముఖంలో వెలుగు ఆరిపోయింది.

ముందుకు వేయబోతున్న అడుగు వెనక్కి పడిరింది.

నమ్మలేనట్లు అలాగే కొంత సేపు నా ముఖంవేపు చూచి....

"మరి....మీరు అచ్చు మాధవిలా....ఉంటేను...." అతనిమాటలు తడబడ్డాయి.

తలెత్తి అతని ముఖంలోకి తీక్షణంగా చూసాను.

అతను నా చూపులకు తట్టుకోలేక నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ దూరంగా వెళ్ళిపోయాడు.

అతడు కనిపించినంతవరకు చూసి హాయిగా గాలి పీల్చుకున్నాను.

ఒక గండం గడిచిపోయినట్లు ఫీలయ్యాను.

నాకా క్షణంలో అంత మంచి ఐడియా తట్టినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను.

కానీ ఒకనాడు ఇటువంటి అనాలోచితమైన పనికి చింతించాల్సి వుంటుందని తెల్సివుంటే నేనంతగా గర్వపడేదాన్ని కాదేమో.

ఈనాడు ఒంటరిదాన్నయి నా దౌర్భాగ్యాన్ని నిందించుకోవాల్సిన అవసరం వుండేది కాదేమో.

అతడు తన బామ్మ చావు కబురు తెలిసి, తన ఒంటరితనానికి రోదిస్తూ, ఉన్న ఒకే ఒక్క ఆశతో తన జీవనజ్యోతి మాధవి కొరకు ఎదురుచూస్తూ జీవిస్తున్న అతనితో తను ఒక్క మెరుపు మెరిపించి పూర్తిగా అంధకారం చేశానని తెలిసుంటే అంతగా సంతోషపడేదాన్ని కాదేమో.

నా జీవితపథం వేరు, అతని జీవిత పథంవేరు. అతనికి నేను సర్వస్వం. నా కతడు ఏమీకాడు. నా బంగారుకలలే నా సర్వస్వం అప్పట్లో. రెండు విభిన్న పథాల్ని మోసుకుంటూ కదిలిపోయింది రైలు బండి.

★ ★ ★ ★

రెండు నిండు సంవత్సరాల తర్వాత మరలా కనిపించాడు మోహనుడు. ఆరోజు స్టేషనులో అతడు కనిపించినప్పుడు కలిగిన భయంగానీ, బాధగానీ లేవిప్పుడు నాకు. నాలో నా ఆశయాలు బలంగా హత్తుకుపోయాయి. అతనిని ఎదుర్కోటానికి ధైర్యంగా నిలబడ్డాను.

వడివడిగా వస్తున్న అతను ఎవరో ఆజ్ఞాపించినట్లు ఆగిపోయాడు. ఒక నిమిషం నా ముఖంలోకి నిదానంగా చూచి,

"మీరు శారద కదూ!" అన్నాడు.

"అవును. ఏమి?" అన్నాను ధైర్యంగా, సౌమ్యంగా.

"ఏంలేదు. మరలా రెండోమారు నా మాధవి అనుకొని పొరబడ్డాను" నీరసంగా ఉన్నాయి అతని మాటలు.

"నా మాధవి!" షాక్ తిన్నాను.

ఒక పురుషుడు తనను గాఢంగా ప్రేమిస్తున్నాడని తెలిస్తే స్త్రీ తప్పకుండా ఇష్టపడుతుంది, ప్రేమించకపోయినా సరే.

నా గురించి మోహనుడికి ఎటువంటి అభిప్రాయాలున్నాయో నన్నెంత గాఢంగా ప్రేమిస్తున్నాడో తెలిసికోవాలనిపించింది నాకూ అందరి స్త్రీలలాగే. దానివల్ల అతనికి బాధ కలుగుతుందనయినా ఆలోచించకుండా ఉన్నాను.

"మా మాధవి గురించేనా ఏంటి మీరనేది?"

"మీ బాధవా? ఎలా వుంటుంది" ఆత్రుతంగా ముందుకు వంగి అడిగాడు.

"సన్నగా, పొడుగ్గా, ఎర్రగా అచ్చు నాలాగే వుంటుంది" అతని ముఖంలోకి పరీక్షగా చూస్తూ అన్నాను.

"అవును. మాధవి అచ్చు మీలాగే వుంటుంది. ఆమె మీకు తెలుసా?"

"ఆ తెలుసు. ఆమె మా క్లాస్‌మేటు" అన్నాను అతి తేలిగ్గా.

"అమ్మాయిదేవూరు. వాళ్ళ నాన్నగారి పేరు తెలుసుంటే చెప్పరా?" దీనంగా అడిగాడు.

మా వూరి పేరు, నాన్నగారి పేరు చెప్పాను.

అతని ముఖం సంతోషంతో వెలిగిపోయింది. తన ఆనంధాన్ని కప్పిపుచ్చుకుంటూ మెల్లగా అన్నాడు.

"ఆమె ఇప్పు డెక్కడుంది?"

అతని ప్రశ్నకు జవాబు చెప్పలేదు నేను. అతనినీ తమాషా చేయాలనే చిలిపి కోర్కె బయలుదేరింది నాలో.

నా యీ మూడు సంవత్సరాల కాలేజీ జీవితంలో ప్రేమ, ఆరాధన అని ఎవరయినా అంటే హేళన చేసేదానిని నేను. ఇప్పుడుకూడ మోహనుణ్ని చూడగానే అలాగే అనిపించింది.

"మీరు మాదవిని ప్రేమించారా?" అన్నాను చిలిపిగా.

మోహనుడు సున్నితంగా సిగ్గుపడ్డాడు.

మనసులో నవ్వుకుంటూ అతనివేపు చూశాను. ఆరోజు స్టేషన్లో చూచిన మోహనుడిలా లేడు. నీటుగా, హుందాగా కనిపించాడు.

అతను నావేపు చూశాడు తన ప్రశ్నకు జవాబు చెప్పమన్నట్లు.

"ఆ అమ్మాయిని ప్రేమించే మీరు ఆ అమ్మాయి ఎక్కడుందో తెలిసికోలేకపోయారా?" అడిగాను తనని ఉడికించాలని.

మోహనుడు చెప్పాడు. చెప్పేటప్పుడు అతని గొంతులో బాధ ధ్వనించింది.

"మాకు తెలిసీ తెలియని వయస్సులోనే మేమిద్దరం అల్లుకుపోయాం. ఆ వయసులోనే విడిపోయాం. మధ్యలో ఒకమారు కలుసుకున్నాను. అంతే. ఇంతవరకు తిరిగి కనిపించలేదు.

ఎప్పటికయినా నా అదృష్టదేవత కనపడుతుందని ఎదురుచూస్తూ ఈ జీవితాన్ని గడుపుతున్నాను."

నేను కాస్త బిగ్గరగా నవ్వాను.

నేను అధికప్రసంగం చేస్తున్నానని కాబోలు మోహనుడు ముఖం చిట్లించుకున్నాడు.

కాని తన మాధవి కొరకు శాంతంగామారి, "చెప్పరూ?" అన్నట్లు నావేపు చూసాడు.

నేనే ఆ మాధవినని తెలిసుంటే, ఏ మాధవి కొరకయితే అతను ప్రతిక్షణం ఎదురు చూస్తున్నాడో ఆ మాధవే ఎదురుగా నిలబడి తనని హేళన చేస్తోందని తెలిస్తే అప్పటికప్పుడే భూమిలోకి క్రుంగిపోయేవాడేమో అతను.

"ఎప్పుడో చిన్నతనాన విడిపోయిన మాధవిని గుర్తుపెట్టుకున్నారా" అన్నాను ఆశ్చర్యం నటిస్తూ.

"నా చిన్ననాటి చెలికత్తె, చిలిపి పిల్ల నా మధూనెలా మరచిపోను? నా కొరకు తన అమూల్యమైన కన్నీళ్ళతో భూమాతకు అంజలిఘటిస్తూ నన్ను వోదార్చే నా మధూను గుర్తుపెట్టుకోకుండా ఎలా ఉండగలను?" గొణుక్కున్నాడు.

ఆ మాటలు నాలో కొద్ది చలనాన్ని కలిగించాయి.

"నా చిన్ననాటి చిలిపి పనులు ఇంకా గుర్తుపెట్టుకున్నాడా! నన్నింతగా ఆరాధిస్తున్నాడా?" ఆశ్చర్యంతో నన్ను నేనే ప్రశ్నించు కున్నాను.

"ఆమె ఇప్పుడెక్కడుంది?" మరలా అడిగేడు.

ఇంతవరకూ భద్రంగా దాచుకొన్న నిజం చెప్పేయాలనిపించింది. కాని అంతలోనే నా అహంకారం నన్ను అలా చెప్పనీయ లేదు.

అందువల్లనే వున్న నిజం చెప్పి అతనిముందు నన్ను నేను చిన్నబుచ్చుకోలేదలుచుకోలేదు. అలా అతనితో తన జీవితం గడుపు కోవాలనిపించలేదు.

ఆ వూహ నాకు భయంకరంగా అనిపించింది.

మరలా ఈరోజు ఆ నిజాన్ని కప్పిపుచ్చటానికి ఇంకొక అబద్ధ మాడాను

"ఆ అమ్మాయి పెళ్ళయి రెండేళ్ళయింది" అతని ముఖంవేపు పరీక్షగా చూస్తూ నెమ్మదిగా అన్నాను. ఆ మాటతో—

అతని ముఖం వెలవెలపోయింది. నా మాటలు అతని హృదయంలో శూలాల్లా గ్రుచ్చుకొన్నట్లున్నాయి.

అతని కనుగుడ్ల చలనం ఆగిపోయింది.

మరి మాట్లాడకుండా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్ళి పోయాడు.

తనది అనుకున్న మాధవి ఎప్పుడూ యింకొకరిదిగా వూహించని మాధవి పూర్తిగా శాశ్వతంగా ఇంకొకరి సొత్తు అయిందనీ తెలిసిన మోహనుడు ఆ ధాటికి తట్టుకోలేకపోయాడు.

అది అతని స్వార్థమే కావచ్చు కానీ అది అతని అపరాధం మాత్రం కాదు.

నాకున్న ధన గర్వంతో, విద్యా గర్వంతో నా జీవితంలో, నా నా జీవితంలో ఒక నాటకం సృష్టించాను.

ఆ నాటకంలో నేనే సూత్రధారాణినై ఒక ఆట ఆడాను. ఆనా డనుకున్నాను. ఆ ఆటలో మోహనుడు ఓడిపోయాడని.

కానీ....కానీ ఆ "గేమ్"లో ఎక్కువగా వోడిపోయింది పోగొట్టు కొందీ నేనే.

ఈనాడు కలం చేతిలో ఉంచుకొని నా దురదృష్టాన్ని నిందించు కోడానికి నేనే కారకురాల్ని. అందుకు నే నెవర్ని బాధ్యుల్ని చేయ లేను.

మరొక్క సంవత్సరానికి నే కోరుకుంటున్న ఆశయాల్ని అందుకోగలిగాను. ఎదురు చూస్తున్న అంతస్థును చేరుకోగలిగాను. అందంలో మన్మధుడు, డబ్బులో కుబేరుడు, అంతస్తులో నేనూహించ లేనంత గొప్పవాడు నాకు భర్త అయ్యాడు. అతనితో నాకు మూడవ సంవత్సరంలోనే పరిచయమైంది. అతను 'నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అన్నాడు. 'సరే' నన్నాను. ఇంట్లో అంతా యిష్ట పడ్డారు. ముఖ్యంగా నేను కోరుకొన్నది నాకు లభిస్తోంది. అంతకంటే ఏం కావాలి? కాని అతను నన్ను చదువు మానేయమన్నాడు. మొదట నేను దాన్ని అంగీక రించకపోయినా ఆ తర్వాత ఆ మెకానికల్ జీవితం మీదా నాకూ మోజు పోయింది నిర్విచారంగా చదువుకు స్వస్తి చెప్పి అతనితో నా జీవితాన్ని ముడి పెట్టాను. అతను కుబేరుడు, మన్మధుడు. కానీ....కానీ స్త్రీకి సౌఖ్యమివ్వలేని పురుషుడు. స్త్రీని స్త్రీగా చూడలేని అంధుడు. ఆమె కంటూ ఒక వ్యక్తిత్వముందని గౌరవించలేని అహంకారి. అతను నా భర్త.

నా భర్త నన్ను చులకనగా చూచినప్పుడు, అతను త్రాగివచ్చి తెలివి తప్పేలా కొట్టినప్పుడు, తనని మనిషిలా కాకుండా మట్టిబొమ్మలా చూస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నపుడూ, మోహనుడు, నా కొరకు పరిత

పించే నా మోనా గుర్తుకు వచ్చి వెక్కి వెక్కి ఏడ్చేదాన్ని. స్టేషన్‌లో అతను కన్పించినప్పటి నా ప్రవర్తనను తలచుకుని-కుమిలిపోయేదాని. అతని తీయటి కబుర్లు గుర్తుతెచ్చుకుని నా బాధను మర్చిపోవాలని ప్రయత్నించేదాన్ని.

"నేను యేడిస్తే నాతోపాటు నా కొరకు కన్నీళ్ళతో భూమాతకు అంజలి ఘటిస్తూ నన్ను వోదార్చే నా మధూ నెలా మర్చిపోను?" ఆనాటి మోహనుడి మాటలు ఆమెని వోదార్చేవి.

అప్పుడు నా జీవితాన్ని రక్షించుకోవడానికి రెండు అబద్ధాలు చెప్పి, అతని జీవితాన్ని బలిపెట్టాను. ఇప్పుడు నేను కోరుకున్న జీవితంతో సంతృప్తి పడలేకా, ఎవరినీ నిందించలేకా బాధపడుతూ, ఆ బాధను మర్చిపోవడానికి అతని వూహలనే సాధనంగా ఉపయోగించుకుంటున్నాను. "ఎంత స్వార్ధపరురాలిని నేను!"

ఇక నా కలం కదలదు. ఇక దానికి భవిష్యత్తు తెలియదు. ఏదో ఒక రోజు నా మోనా కన్పిస్తాడు. అంతటితో ఈ కథ పూర్తవుతుంది. ఆ క్షణం కొరకే ఎదురు చూస్తున్నాను. అతని పాదాలను నా కన్నీటితో అభిషేకం చేస్తూ క్షమించమని అడిగితే చాలు. అంతే చాలు! అతను క్షమించినా, శిక్షించినా హృదయపూర్వకంగా స్వీకరిస్తాను.

★ ★ ★ ★

ఆమె కలం ఆగిపోయింది.

దానితోపాటు ఆమె మనసు కూడా అలసిపోయింది. అలా ఆ కాగితాల మీదనే ఒరిగిపోయి నిద్రపోయింది.

"మా....ధ....వీ!" ఎక్కడినుండో త్రాగుడు మైకంలో గతి తప్పిన స్వరం.

ఆ స్వరానికి మాత్రమే అలవాటుపడ్డ ఆమె ఉలిక్కిపడి లేచింది. గబగబ వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా భర్త. ఎర్రని కళ్ళతో.

"ఏం చేస్తున్నా....వు ఘన....కార్యం ఎంత సేపు పిలవాలి రాణీ గారిని."

ఆమె చెంప ఛెళ్ళుమంది.

"క్షమించండి....వినపడలేదు."

"వినిపిం....చక పోవడానికి ఏ లోకాల్లో వున్నావు."

ఆమె మాట్లాడలేదు.

"ఏం మాట్లాడవు? మొగుడంటే ఏమైనా గౌరవం వుందా?"

ఆ అరుపులు ఎవరయినా వింటారని భయపడింది మాధవి.

"మీకు మనస్సు స్థిమితంగా లేదు. రండి కాసేపు పడుకుందురు గానీ."

అతనికి అడ్డు తొలగి వెనక్కు తిరగబోయింది.

"ఏమిటి నీ ఉద్దేశం. 'త్రాగుబోతు వెధవా!' అంటావా?" ఆమె చెంప పగిలిపోయింది. ఒక్క త్రోపు తోసాడు.

తను ఇంతకాలం మోస్తున్న తన జీవిత కథ పేపరు మీద. కెక్కించేసరికి ఆమె పూర్తిగా బలహీనురాలయిపోయింది. ఇక ఎదిరించ డానికి కూడా శక్తిలేక పోయింది. ఆమె తల గిరగిర తిరుగుతున్న టేబిల్ ఫ్యాన్‌కు కొట్టుకుంది. కుప్పలా కూలిపోయింది.

హాస్పిటల్‌లో, స్పెషల్ వార్డులో మెత్తటి పరుపు మీద కళ్ళు తెరిచి మాధవి ఎదురుగా, మెడలో స్టెతస్కోపు తగిలించుకుని తనవైపు చూస్తున్న.... మోహనుడు. సంతోషంతోనూ, దుఃఖంతోనూ ఆమెకు నోట మాటరాలేదు. తను ఇంతకాలం ఎదురు చూచిన మోహనుడు. తనను పలకరించకుండానే వెళ్ళిపోయాడు. శాంత గంభీర మూర్తిలా నడుచు కుంటూ.

మెడలో స్టెతస్కోపులో మోహనుడ్ని చూచి అమితంగా ఆశ్చర్య పోయింది మాధవి.

"తననుకోలేదు తన చిన్ననాటి చెలికాడు, బాంధవుడు, ఆనాడు పరీక్ష పోగొట్టుకున్న మోనా, మాసిన చొక్కాతో, చింపిరి జుట్టుతో తనకు స్టేషన్‌లో కన్పించిన మోహనుడు, తనచేత అసహ్యించుకోబడిన ఆ దుర దృష్టవంతుడు ఇప్పుడు డాక్టరు ఎలా అయ్యాడో తన వూహ కందని విషయం."

"నేను రోగిని, అతను డాక్టరు. అతను దేవుడు, నేను భక్తురాలిని అతను జడ్జి, నేను అపరాధిని. ఒకనాడు డాక్టరు అవబోతున్నాను కదా! అని ఆ పసివాడిని, ఆ బీదవాడిని అసహ్యించుకున్నాను. కానీ నేడు నేను ఆ బీద డాక్టరు క్రింద రోగిని. అబ్బ! ఎంత సంతృప్తిగా వుంది. ఈ శిక్షలో ఎంత ఆనందం వుందీ!!"

"మెలుకువ వచ్చిందా?" అంటూ గంభీరంగా అడిగాడు ఆనాటి చిలిపి మోహనుడు ఆమెను.

మాధవి కళ్ళనీళ్ళు ఆగలేదు.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తుంది. అతనికి అర్థం కాలేదు. తన పేషంటు ఎందుకు ఏడుస్తుందో

"మోనా!" వెక్కిళ్ళ మధ్యగా మమత నిండిన పిలుపు.

ఆమెను శారదగా అనుకుంటున్న డాక్టర్ మోహన్ ఉలిక్కి పడ్డాడు.

అతని కళ్ళు ఆత్రంగా ఆమె కళ్ళల్లోకి చూశాయి.

"నువ్వా! నా మాధవివా?" ఒక్కమారుగా అంత సంతోషాన్ని భరించలేకపోయాడతను.

ఆ సంతోషంతో ఆ మాటలు పెదవులుదాటి పైకి రాలేక పోయాయి.

"ఎవరు పిలుస్తారు? ఇంకెవరు పిలుస్తారు తనని 'మోనా' అని. నా మధూకి తప్ప ఆ పిలుపు ఇంకెవరికి తెలుసు?" అతని కళ్ళు మెరుస్తున్నాయి.

"మోనా! మోనా!! నాకు ప్రాయిశ్చిత్తం లేదు. నేను నిన్ను మోసం చేశాను. నేను శారదను కాను. మాధవిని. నీ మాధవిని మోనా- కానీ...." ఆమె ఆగి అతని కళ్ళల్లోకి చూచింది.

"క్షమించు మోనా! ఒక్కమారు క్షమించావను మోనా!"

అతను తేరుకుంటున్నాడు.

"పోనీ....శిక్షించు మోనా!....ఆనాడు నువ్వడిగావు. 'పోనీ బాగా చదువుకుంటాను. నా జట్టుంటావా మాధవీ!' అని. ఆనాడు ఒప్పుకున్నాను. కాని....కానీ....ఈ రోజు నువ్వు బాగా చదువుకున్నావు. అయినా నేను నీ జట్టు కాదు. నీ జట్టు కానేకాదు మోనా" ఆమె ఆయాస పడుతూ ఏడుస్తుంది.

అతని మధురమైన కల చెరిగిపోతోంది.

"ఎవరికొరకయితే ఇన్ని రోజులు తపస్సు చేశాడో ఆ దేవత ప్రత్యక్షమయిందీనాడు....కాన్నీ అతి భద్రంగా హృదయంలో దాచుకున్న దేవతను ఈ స్థితిలో ఎలా చూడడం?" ఇంక కన్పించదనుకున్న మాధవి కన్పించి అతడిని పిచ్చివాడిని చేస్తుంది.

"తన మధు ఎందుకిలా చేసింది?" అదే అతనిని వేధిస్తున్న ప్రశ్న.

"కాదు. కాదు ఈమె నా మధూకాదు. నా మధూ ఎప్పుడూ మోనాని మోసం చేయదు. అమాయకురాలైన ఆ పసిపిల్లకు అబద్ధం ఆడడం కూడా చాతకాదు" అతనిలో సంఘర్షణ మొదలయింది. బలవంతంగా నిజాన్ని అబద్ధంగా నమ్మడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు

"ఒకే ఒక్క నిజం అతనిని మరలా వెనక్కు నెడ్తోంది. కానీ....మాధవి తన మధూ తప్ప తనని అలా ఎవ్వరూ పిలవరు. నిద్రలో అయినా సరే ఆ పిలుపును పోల్చుకోగలడు తను. సంవత్సరాలు దొర్లిపోయినా ఆ పిలుపులో మాధుర్యం ఇంకా చెదరలేదు. అలాటి పిలుపును కాదని ఎలా అనగలడు?"

"ఈ రోజు నాకెందుకు కన్పించావు మధూ...కన్పించి నేను పవిత్రంగా పూజిస్తున్న నా దేవతకు ఎందుకు మసి పులుముతున్నావు? నా దేవతను మోసకత్తెగా, అబద్దాలకోరుగా ఎలా నమ్మను? నమ్మి నేనెలా బ్రతుకను? ఏ ఆశతో బ్రతకమంటావు? అతని హృదయంలో మధూ తాలూకు స్థలం తప్ప మిగతాదంతా మండిపోతోంది.

ఆ స్థలం తాలూకు చరిత్ర ఎంత హీనమయినదయినాసరే దానిని తాకటానికి ఆ మంట సాహసించలేక పోతోంది.

"పోనీ....పోనీ....గతాన్ని మరచిపోతాను....."మోనా!" అనే ఆ మధురమైనపిలుపు కొరకు ఆమెను క్షమిస్తాను. ఆ పిలుపును స్వీకరిస్తాను."

అతని కనురెప్పలు టపటప కొట్టుకున్నాయి. వాటి వెనుక గతం విస్మరించబడింది. ఒక్కడుగు ముందుకు వేసాడు. వాకిట్లో ఎవరిదో నీడ పడింది. అతని కళ్ళు ఆమెను పరిశీలిగా చూచాయి. ఆమె గుండెల మీద మెరుస్తున్న మంగళ సూత్రంమీద ఆగి పోయింది అతనిచూపు. అంతవరకూ ఆమెను ఓదార్చాలని-

"ఇంక నీకు భయంలేదు మోనా! నీకు నేనున్నాను" అని చెప్పాలనీ, ఇంకా ఏదో మధురమైన మాటలను మనసులోనే, అల్లుకుంటున్న మోహన్ ఆగిపోయాడు.

అతని కళ్ళలోకి ఆశగా చూస్తూ మమకారం నిండిన స్వరంతో పిల్చింది ఆమె.

"మోనా?"

ఒక్క క్షణం కాలంలో అతని కళ్ళల్లో మెదిలిన నిరాశ తాలూకు తడిని కనురెప్పలు పీల్చుకున్నాయి. మనస్సులోనే నిట్టూర్చి జీవితమంతా కూడబెట్టిన బలాన్ని తీసుకుంటూ అస్థిరంగా అన్నాడు.

"క్షమించండి. నేను మీరనుకునే మోనానికాను. నా పేరు చిరంజీవి. నేను డాక్టర్ చిరంజీవిని."

ఇక అక్కడ నిలవకుండా వడివడిగా అడుగు లేసుకుంటూ వెళ్ళిపోయాడు డాక్టర్ మోహన్.

షాక్ తింది మాధవి. ఆమె అనుకోలేదు అతనినుండి అటువంటి జవాబు వస్తుందని. మొదట్లో అతను శిక్షిస్తాడనుకుంది. తర్వాత క్షమిస్తాడనుకుంది. అతి విచిత్రమైన కాలం మధ్యలో గడిచిపోయినా, తన మోనా ముఖభావాలు చదవగలదామె.

"తన అంచనా తప్పయిందా? కాదు కాదు, అతను మోహనే. నా కొరకు..తన మాధవి కొరకు అబద్ధమాడాడు. ఈ అబద్ధంలో ఎంత త్యాగముంది" ఆమె హృదయం నిండుకుంది.

"ఏ అబద్ధంతో అయితే నీ ఆశాజ్యోతిని నేను ఆర్పేసానో ఆ అబద్ధంతోనే నా జీవితాన్ని వెలిగించాలని చూస్తున్నావు నువ్వు. నేను స్వార్థంతో చేసినపనిని నువ్వు ఎంత త్యాగంతో చెయ్యగలిగావు మోనా!"

"ఎంత భారమైన శిక్ష విధించావు మోనా? ఎలా మోయనీ భారాన్ని?"

"శిక్షా భారంకూడా ఒక మాధుర్యంగా వుంటుందనీ నాకు తెలియదు. ఈ శిక్షను సంతోషంగా మోస్తాను మోనా!"

ఆమె ఇక ఆలోచించడానికి వోపిక లేకపోయింది. మత్తుగా, నీరసంగా, బలహీనంగా పాలిపోయింది. వాలిపోయాయి కనురెప్పలు.

"ఎలావుంది మాధవీ!" భర్త పిలుపు ఎక్కడో విన్పించింది ఆమెకు.

పెదవులమీద చిరునవ్వుతో హీనస్వరాన లేచి అంది ఆమె-"చాలా బాగుంది."